# అనగా అనగా ఒక మంచివాడు

డాక్టర్ ఎమ్. సుగుణరావు

**"మీరింక కొద్దిఘడియల్లో చనిపోతారని తెలిసినపుడు మీ ఆత్మీయులకో, ఈ సమాజానికో మీరిచ్చే ఆఖరిసందేశం ఏమిటి? మరణశయ్య మీద మిమ్మల్ని ఊహించుకొని రాయండి. అలా అద్భుతంగా రాసినవారికి మేమిచ్చే ఒకే ఒక బహుమతి పదివేల రూపాయలు...."**

ఆ వీక్లీలో ప్రకటన చదివిన పార్థసారథిలో ఏదో అలజడి! మెదడులో ప్రకంపనాలు. ఆ ఆస్పత్రిగదిలో వెల్లవేయని గోడలు, అతడి శరీరంలాగే పాలిపోయి వున్నాయి. కాంతిలేనికళ్లతో అతడు ఆ ఆస్పత్రి మంచంపై పడుకుని ఆ వీక్లీలోని ప్రకటన చదువుతున్నాడు.

ఇంతలో ఎవరో వస్తున్న చప్పుడు. ఆత్రంగా చూశాడు తనవాళ్లేమోనని. మల్లెపువ్వుల్లాంటి బట్టలలో కరుణామయిలా కనబడింది నర్స్. ఆమె నవ్వింది. చిన్నగా నవ్వాడు నవ్వక తప్పదన్నట్లు. "త్వరలో డిశ్చార్జ్ చేసేస్తాం!? " ఎంత తీయని అబద్ధం! ఆమె బెడ్‌షీట్ సర్దుతోంది. క్షణంసేపు ఆలోచనల్లో పడ్డాడు. ఔను! ఆమె చెప్పింది నిజమే, తనని ఈ లోకంనించి డిశ్చార్జ్ చేసేస్తారు కాబోలు అనుకున్నాడు. ఆమె థర్మామీటరు నోటిలో వుంచింది. కళ్లుమూసుకున్నాడు. నుదిటిమీద చల్లనిచేయి. కళ్లు తెరిచాడు. ఎదురుగా డ్యూటీ డాక్టర్ . "ఫరవాలేదు. త్వరలోనే పంపించేస్తాం! మళ్లీ అదేమాట! అబ్బ తనను క్షణక్షణం చంపుతున్నారే!, బాధగా కళ్లు మూసుకున్నాడు. వారు వెళ్లిపోతూ అనుకుంటున్న మాటలు మెల్లగా వినిపించాయి. "పూర్‌ఫెలో, ఏ వ్యసనాలు లేకుండా ఇన్ని జబ్బులు ఎలా వచ్చాయో!!?"

పార్థసారథి కళ్లు తుడుచుకున్నాడు. తనకు చెవులు పనిచెయ్యడం మానేస్తే బాగుండును. ఎవరేం మాట్లాడినా భరించలేకపోతున్నాడు.

"ఔను, తనకి ఏ వ్యసనమూ లేదనే అనుకుంటున్నారు వాళ్లంతా. తనకున్న వ్యసనం గురించి మూడోకంటివాడికి తెలీదు. సిగరెట్‌లోని నికోటిన్లా, ఆల్కహాల్ మత్తులా, ఎల్.ఎస్.డి, భంగు, జర్దా ఇవేవీ కలిగించని మత్తు ఆ వ్యసనం వల్ల కలిగింది. ఇన్నేళ్లుగా, తనలాంటి వ్యసనపరులుంటారు, ఎవరో?ఎక్కడో? జీవితమాధుర్యాన్ని వారు కోల్పోకుండా తన అంతిమసందేశం వారికి అందజేయాలి....అది తన డెత్‌స్టేట్‌మెంట్. ఆ పత్రిక వారడిగింది కూడా అదే! కళ్లు రుద్దుకున్నాడు. రెండు రోజుల క్రితం తనని ఆస్పత్రిలో చేర్చినప్పుడు తను నిద్రపోతున్నాడని డాక్టరు తమ్ముళ్లతో అంటున్న మాటలుగుర్తొచ్చాయి. "ఆయనంత నిర్లక్ష్యం చేశాడే! కిడ్నీలు పాడయ్యేవర కూ ఊరుకున్నాడే! ..." వెంటనే తమ్ముడు డాక్టరుతో అన్నాడు......" మా అన్నయ్య అంతేనండీ...ఎవరికీ ఏమీ చెప్పడు...అన్నీ తనలోనే దాచుకుంటాడు. మరీ.... మంచివాడు.


"ఔను తను మంచివాడు, అలా అందరితో అనిపించుకోవాలనే తనీ స్థితి కి వచ్చాడు. తనకు క్షణక్షణం టెన్షన్. ఎవరితో ఏ వైరుధ్యమూ లేకుండా ఉండాలనేందుకు అంతర్మథనం, ఆ వేదన గుండెల్లో చేరి ఇస్కీమియా, నరాల్లో చేరి న్యూరోసిస్, జీర్ణకోశంలో చేరి అల్సర్లు, చివరికి కిడ్నీల్లోకి చేరి రీనల్ ఫెయిల్యూర్ కలిగించింది. ప్చ్....." నిట్టూర్పు విడిచాడు. కళ్లు మూసుకుందామని ప్రయత్నిస్తే కనురెప్పలు బరువుగా కదిలాయి.సెడేటివ్‌లు కూడా పనిచేయడం మానివేశాయి. గతం జ్ఞాపకాలు స్మృతిసముద్రంలో కెరటాల్లా ఎగిసిపడుతున్నాయి.

భార్య గుర్తొచ్చింది. సన్నగా పల్చగా పసితనం పీడనిముఖం. ఆమె తన అడుగుజాడల్లోనే నడిచేది. తను ఏ సుఖమూ ఇవ్వలేకపోయేవాడు. పిల్లలు పుడితే తోబుట్టువులకు సహాయపడలేమేమోనని కొంతకాలం సంతానం లేకుండా చేశాడు. ఆ తర్వాత అసలు సంతే లేకుండా పోయింది. తనిప్పుడు లేదు. తనకంటూ ఎవరినీ మిగల్చకుండా వెళ్లిపోయింది. పార్థసారథి మనసులో విషాదమేఘాలు కమ్ముకున్నాయి.

"రాలిపోయేపువ్వా నీకు రాగాలెందుకే... వాలిపోయే పొద్దా నీకు వర్ణాలెందుకే....అవును.భలే!" సమాధానపడ్డాడు పార్థసారథి. ముఖంమీద చిరుచెమటలు. కరెంటు ఆగిపోయింది. గాలి రావడం లేదు. ఎక్కడా అలికిడి లేదు. అర్థరాత్రో, తెల్లవారో తెలీదు. తిండితినడం మానేశాడు. ఇలా తిన్నది అలా బైటికొచ్చేస్తోంది. అన్ని ద్వారాలు తెరుచుకుంటున్నాయి. స్వేచ్ఛాజీవి తను. వృద్ధాప్యం నించి బాల్యంలోకి మళ్లీ పయనం. సిగ్గుబిడియం లేదు. నర్సుతల్లులు, ఆయమ్మతల్లులకు జై! అమ్మకు ప్రతిరూపాలు వీళ్లు. చీము, నెత్తురు, మలమూత్రాల పట్ల వీరికి అశౌచం లేదు. తోబుట్టువుల కన్నా వీళ్లే నయం. తను చావడం ఖాయమని తనకి తెలుసని, తమ్ముళ్లకి తెలుసు. అయినా తగ్గిపోతుందనే మోసపుమాటలు. "ఔను....అంతా నటన .... నాదీ నటనేమో.... మంచివాణ్ణనిపించుకోవడం కోసం హంతకుణ్నయ్యాను. కడుపులో జీవాన్ని భూమ్మీదకు రాకుండా హత్యచేయించాను. మంచివాణ్ణనిపించుకోవడంకోసం అందరికష్టాలనూ మోశాను. రాత్రనక, పగలనక, నావాళ్ల కోసం కష్టాలు పడ్డాను. .....ఆ కష్టాల్లోనే కలలు కన్నాను. ఇంతాచేస్తే నేను పెంచినమొక్కలు నాకేమిచ్చాయి ..... "జీవఫలం....చేదు విషం...."


పార్థ సారథిలో పలవరింతలు. కళ్లు బరువుగా మూసుకున్నాయి.

* * *



నిద్దట్లోంచి మళ్లీ మెలకువ. పత్రిక ప్రకటన గుర్తుకొచ్చింది. తనిప్పుడు డిక్లేషన్ ఇవ్వాలి. ఎవరికి ఇస్తాడు?.....మనసుకు చెపుతాడు తన అంతిమ సందేశం....

...."నా అరవయ్యేళ్ల బతుకుపుస్తకంలోంచి నాలాంటి వ్యసనపరులకు నేనిచ్చే ఆఖరిసందేశం......అందరితోనూ మంచివాడనిపించుకోవాలనే తపనతో అంతర్ముఖుడిలా బతికాను. జీవితంపట్ల మమమకారం, లేదనీ, ఈ సాపేక్షమైన సృష్టిలో సర్వంమిథ్య అనీ సమర్థించుకుంటూ, నేను బతికిన బతుకులోంచి నేర్చుకున్న జీవితపాఠం, ఇది వరకు ఎవరో చెప్పారేమో ఈ ఇతిహాసం ... మళ్లీ



వారం వారం కథాప్రభ

నాకోణంలోంచి చెబుతున్నాను.

"అందరితోనూ మంచివాడనిపించు కోవాలనుకోవడం అన్ని వ్యసనాల కన్నా ప్రమాదకరమైనది. అందరికీ మంచివాడవు కాలేవు. దుర్మార్గులూ, అవినీతిపరులు, కుసంస్కారులూ మానవ సంబంధాలను వ్యాపారంగా మార్చేవాళ్లు...వారికి మంచివాడవు కాగలవా? అందుకే మంచి మాత్రం చేసుకుంటూ సాగిపో." పార్థసారథిలో అలజడి తగ్గింది. హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఇన్నాళ్లు నాలో దాగిన ఈ అంతర్మథనం గురించి మనసుతో చెప్పుకున్నాను. సమాధానపడ్డాడు. అతడి కళ్లు బరువుగా మూసుకున్నాయి.

• • •

పార్థసారథి సుషుప్తిలో ఏదో చైతన్యం. అది క్రమేణా రూపుదిద్దుకుంది. ఏవో అర్థంకాని ఆలోచనలు....ఆ ఆలోచనలకు ఒకరూపం ఏర్పడితే.... అయ్యో! అనుకున్నాడు మనసులో. రెండు విరుద్ధభావాల సంఘర్షణ! ఔను. తను పార్థసారథి. పుట్టిన దగ్గర్నుంచీ చనిపోయేవరకు ఒకే ఆలోచన. దృక్పథం. అందుకు విరుద్ధంగా ఆలోచించడు.....! అంతే! తాను మంచివాడుగానే పోతాడు. తనేమీ లోకానికి సందేశాలివ్వడు. తన అంతరంగం ఇదీ అని తెలిస్తే చరిత్రహీనుడవుతాడేమో! తన మనసుగోడు వినకుండా దాన్ని మనసులోనే పదిలపరచాడు. తన భావాలు ఎవరూ చదవలేరు. మనసుకు మాత్రమే తెలుసు తన సంఘర్షణగురించి.... పార్థసారథిలో ఏదో సంతృప్తి. మగతగా కళ్లు మూసుకున్నాడు.

• • •

అంతా హడావుడిగా వుంది. పార్థసారథి కళ్లు తెరవలేకపోతున్నాడు. మసగబారిన కళ్లకు అందరూ నీడల్లా కనిపిస్తున్నారు. కడుపులోంచి గొట్టం నోట్లోకి పెట్టారు. స్టెతస్కోపు కాబోలు గుండెల మీద పాములా పాకుతోంది. తలకిందులుగా ఏదో బాటిల్ వేలాడుతోంది. దాంట్లో ఎర్రటిద్రవం. ఇంతలో ఎవరో ఏదో అన్నారు. "చాలా మంచివాడు. ......తోబుట్టువుల కోసం జీవితంధారపోశాడు." .....అబ్బ ఎంత చక్కనిమాట? అమ్మపాడే జోలపాటలా ఉందే! అలా అనుకుంటూ.......హాయిగా ప్రాణం విడిచాడు పార్థసారథి.